# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్ లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకొని భారత సాయుధ దళాలు నిన్న రాత్రి క్షిపణి దాడులు నిర్వహించాయి.
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఈరోజు కేంద్ర మంత్రివర్గం సమావేశమయ్యింది.
- పెహల్గామ్ లో జరిగిన దాడికి ప్రతిస్పందించే హక్కు భారత్ కు ఉందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- భారత అంతరిక్షరంగంలో ప్రస్తుతం 250 కి పైగా అంకుర సంస్థలు పని చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు.
- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఈరోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులు మరణించారు.

==============================

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ లో దాడి చేసిన ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ దళాలు నిన్న రాత్రి క్షిపణి దాడులు నిర్వహించాయి. పాకిస్తాన్ తో పాటు పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరిట ఈరోజు తెల్లవారుజామున 1:05 నుండి 1:30 గంటల మధ్య సైనిక దాడులను జరిపాయి. ఆపరేషన్ సిందూర్ పై రక్షణ శాఖ, విదేశాంగ శాఖలు సంయుక్త మీడియా సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ, పహల్గామ్ ఉగ్రవాద దాడిపై దర్యాప్తులో భాగంగా పాకిస్తాన్ కు పెహల్గామ్ దాడుల ఉగ్రవాదులతో సంబంధం ఉందని తేలిందన్నారు.

ఇక ఆపరేషన్ సిందూర్ గురించి భారత సైన్యానికి చెందిన కల్నల్ సోఫియా ఖురేషి వివరిస్తూ... ఈ ఆపరేషన్‌లో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని చెప్పారు. అందులో సవాయ్ నాలా క్యాంప్ కూడా ఉందని, ఇక్కడ నుండే లష్కరే తోయిబా సంస్థ గత కొద్ది కాలంగా భారత్ పై దాడులకు పాల్పడిన వారికి శిక్షణ ఇస్తుందని ఆమె తెలియజేశారు.

(సోఫియా ఖురేషి వాయిస్ బైట్... 22 సెకన్లు)

అదే విధంగా.. భారత వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ.. ఈ స్థావరాల ద్వారా పాకిస్తాన్ గత మూడు దశాబ్దాలుగా ఉగ్రవాదులకు మౌలిక సదుపాయాలను సమకూర్చిందన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ఇది భారత ప్రతిచర్య గానే భావించాలని, అలా కాకుండా పాకిస్తాన్ ఘర్షణలను మరింత విస్తృతం చేయడానికి ప్రయత్నించినట్లయితే భారత సైన్యం ధీటుగా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉందని వ్యోమికా సింగ్ హెచ్చరిస్తూ...

(వ్యోమికా సింగ్ వాయిస్ బైట్...32 సెకన్లు)

==============================

పెహల్గామ్ ఉగ్రదాడుల బాధితులకు ఆపరేషన్ సిందూర్ ద్వారా న్యాయం జరిగిందని బాధిత కుటుంబాలు పేర్కొంటున్నాయి. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో మరణించిన కర్నాల్‌కు చెందిన నేవీ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కుటుంబ సభ్యులు ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలను నాశనం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ తండ్రి రాజేష్ నర్వాల్ ఆకాశవాణితో మాట్లాడుతూ.. దీనికి ఆపరేషన్ సిందూర్ అని పేరు పెట్టడం ఖచ్చితంగా సరైనదేనని, ఇది ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు ఓదార్పునిస్తుందని ఆయన అన్నారు. కర్ణాటకలోని శివమొగ్గలో, పహల్గామ్ ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన మంజునాథ్ రావు తల్లి సుమతి, భారత సైన్యం ప్రతిస్పందన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఈరోజు కేంద్ర మంత్రివర్గం సమావేశమయ్యింది. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు సాయుధ దళాలను ప్రధాని మోదీ ప్రశంసించారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి నరేంద్రమోడీ మంత్రివర్గానికి వివరించారు.
ఈ సమావేశంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ విద్యుత్ రంగానికి బొగ్గు కేటాయింపుల విధానం, శక్తి పథకం పునరుద్ధరణకు ఆమోదం తెలిపింది. విద్యుత్ ఉత్పత్తిదారుల థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు తాజాగా బొగ్గు కేటాయింపులను మంజూరు చేయడానికి సైతం ఆమోదం లభించిందని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇదిలా ఉండగా రేపు ఉదయం 11 గంటలకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత అంతరిక్ష రంగం అంకుర సంస్థలు యువ ప్రతిభను ఎల్లప్పుడూ ఆహ్వానిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నేడు భారతదేశంలో 250 కి పైగా అంతరిక్ష స్టార్టప్‌లు ఉన్నాయని, అవి ఉపగ్రహ సాంకేతికత, ప్రొపల్షన్ సిస్టమ్‌లు, ఇమేజింగ్ ఇతర రంగాలలో అత్యాధునిక పురోగతికి దోహదపడుతున్నాయని చెప్పారు. గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ సదస్సు ప్రారంభం సందర్భంగా నరేంద్రమోదీ ఈరోజు ఒక వీడియో సందేశంలో మాట్లాడుతూ... శాస్త్రీయ అన్వేషణ పరిధులను పెంచుకుంటూ భారత అంతరిక్ష ప్రయాణం ముందుకు సాగుతోందని చెప్పారు. భారత్ దేశపు గగన్‌యాన్ మిషన్, దేశం యొక్క పెరుగుతున్న ఆకాంక్షలను ప్రతిబింబిస్తుందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ బైట్... 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఈరోజు భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులు మరణించారు. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ ఆ ప్రాంతంలో ఇంకా కొనసాగుతోంది. బీజాపూర్ జిల్లాలోని కార్రెగుట్ట కొండపై ఈ రోజు ఉదయం ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. CRPF, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, పోలీసులతో సహా వివిధ దళాల భద్రతా సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు 22 మంది నక్సలైట్ల మృతదేహాలను సంఘటనా స్థలం నుండి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, సీనియర్ CRPF అధికారులు నిరంతరం ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత సాయుధ దళాలు తమ శౌర్యం, ధైర్యాన్ని ప్రదర్శించడం ద్వారా కొత్త చరిత్ర సృష్టించాయని రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ని విజయవంతంగా చేపట్టినందుకు భారత సాయుధ దళాలను ఆయన అభినందించారు. నిన్న రాత్రి భారత రక్షక దళాలు అత్యంత ఖచ్చితత్వం, సున్నితత్వంతో వ్యవహరించాయని చెప్పారు. జమ్ము కాశ్మీర్ లోని పెహల్గామ్ లో జరిగిన దాడికి ప్రతిస్పందించే హక్కు భారత్ కు ఉందన్నారు. ఉగ్రవాద స్థావరాలను మాత్రమే ఈ ఆపరేషన్లో లక్ష్యంగా చేసుకున్నామని, ఈరోజు న్యూ ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో రాజ్ నాథ్ సింగ్ పేర్కొంటూ ...

(వాయిస్ బైట్... 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత రక్షక దళాలు ఈరోజు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పై ఆకాశవాణి వార్తా సేవల విభాగం ఈరోజు రాత్రి 9 గంటల 15 నిమషాలకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేయనుంది. ఈ కార్యక్రమాన్ని అన్ని ఆకాశవాణి కేంద్రాలు , ఎఫ్ఎం గోల్డ్ చానల్ ద్వారానూ వినవచ్చు. అలాగే ఆకాశవాణి యూట్యూబ్ ఛానెల్ “ఆకాశవాణి ఎయిర్” లో కూడా అందుబాటులో ఉంటుంది.

==============================

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని ప్రభుత్వం మరొక సంవత్సరం పాటు పొడిగించింది. ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని సంవత్సరం పాటు పొడిగించడానికి క్యాబినెట్ నియామకాల కమిటీ ఈరోజు ఆమోదం తెలిపింది. కాగా.. కర్ణాటక కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి ప్రవీణ్ సూద్ ఈ నెల 25న పదవీ విరమణ చేయాల్సిఉండగా.. ఇప్పుడు ఆయన పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో సంవత్సరం పొడిగించింది.

==============================

పాకిస్థాన్ గత కొద్ది రోజులుగా సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న నేపధ్యంలో నిన్న రాత్రి భారత సైన్యం క్షిపణి దాడులు చేయడంతో వాటిని మరింత తీవ్రతరం చేసింది. దీంతో ఈరోజు పాకిస్తాన్ రేంజర్లు సరిహద్దుల వెంబడి విచక్షణారహితంగా కాల్పులు జరుపుతున్నారు. ఈ ఘటనలో 15 మంది భారత పౌరులు మృతి చెందగా.. 43 మంది గాయపడినట్లు ఆర్మీ అధికారులు వెల్లడించారు.

==============================

==============================